క్లుప్తంగా

సన్మానం



అట్లూరు : వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్‌గా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి నియమితులైన సందర్భంగా పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయనను కాశినాయన మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

నేడు ఎంపీజే ప్రాంతీయ మహాసభ

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎంపీజే రాయలసీమ ప్రాంతీయ మహాసభను ఆదివారం ఉదయం 11 గంటలకు ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, రాయమలసీమ ఇన్‌చార్జ్ అయూబ్‌ఖాన్‌లు తెలిపారు. స్థానిక ఎంపీజే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, వాటి పరిష్కారం, ప్రజలను చైతన్యవంతులు చేయడంపై ప్రసంగిస్తారన్నారు. ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

మట్కా నిర్వాహకులు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక శ్రీనివాసనగర్‌లో మట్కా నిర్వహిస్తున్న పలువురిని టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీనివాసనగర్‌లో మట్కా నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో శుక్రవారం టూటౌన్ సీఐ సదాశివయ్య ఆధ్వర్యంలో ఎస్ఐలు ధనుంజయ, రాఘవేంద్రారెడ్డిలు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో షేక్ గఫార్ అలియాస్ గన్నా, షేక్ కరిముల్లా, షేక్ నాయబ్, రఘు, సన్నముత్యాలు, పాట్టిపాడు నీలాధర్, సయ్యద్‌ఖాజా, సుబ్బయ్యలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 10,170 నగదుతో పాటు 6 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మైదుకూరు : పట్టణంలోని ప్రభుత్వం గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుమధుర విద్యార్థులను పరీక్షించి ఆరోగ్య పరిరక్షణ సూత్రాలను వివరించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తలను సూచించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

పోరుమామిళ్ల : ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నదని రేంజర్ రఘునాథరెడ్డి అన్నారు. పర్యావరణాన్ని కాపాడాలనే లక్ష్యంతో వివేకానంద ఫౌండేషన్ ప్రత్యేకంగా తయారు చేయించిన గుడ్డ సంచులను శుక్రవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి, వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

గోపవరం : 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ కుళాయప్ప, ఏఈఈ శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 33/11 కేవీ పరిధిలోని గానుగపెంట, శ్రీనివాసపురం, పి.పి.కుంట సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు, వ్యవసాయానికి విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

పనుల పరిశీలన

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను శుక్రవారం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్ పరిశీలించారు. ఇందులో భాగంగా రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న నూతన రథాన్ని, నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు. త్వరలో చేపట్టబోయే నూతన కల్యాణ మండపం గురించి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు.

కల్తీ మద్యం మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : కల్తీ మద్యం మాఫియాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దాసరి సువర్ణరాజు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో కల్తీ మద్యం మాఫియా ఆటలాడుతోందన్నారు. ఒక గ్లాస్ కల్తీ మద్యం ఒక జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. ఇందులో కలిపే స్పిరిట్ లివర్, కిడ్నీ, కళ్లు, మెదడుపై తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. కల్తీ మద్యం తయారీదారులపై ప్రభుత్వం చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2019లో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ రంగంలో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్ చట్టం అమలు చేసిందన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రైవేటు కంపెనీలు భూములు, సబ్సిడీలు, రాయితీలు, ఇలా అనేక వనరులను లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫించన్ ఉంటుందో ఊడుతుందో..

- తీవ్ర ఆందోళనలో దివ్యాంగులు
- జిల్లా ఆస్పత్రిలో దివ్యాంగులకు వికలత్వ నిర్ధారణ పునఃపరిశీలన పరీక్షలు



వికలత్వ పరీక్షల కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చిన దివ్యాంగులు

ప్రొద్దుటూరు క్రైం : రెండు నెలల నుంచి దివ్యాంగులకు మనశ్శాంతి కరువైంది. అర్హత లేకున్నా పింఛన్ పొందారని, పింఛన్లలో అవకతవకలు జరిగాయనే నెపంతో కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ సదరం క్యాంపులను ఏర్పాటు చేసి వికలత్వ పరీక్షలను నిర్వహించింది. అనంతరం పింఛన్ తొలగిస్తునట్లు జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి ప్రభుత్వం ఆగస్టు నెలలో నోటీసులు జారీ చేసింది. 10–15 ఏళ్ల నుంచి పింఛన్ పొందుతున్న దివ్యాంగులు కూడా నోటీసులు అందుకున్నవారిలో ఉన్నారు. దివ్యాంగులు పింఛన్ తొలగిస్తే ఎలా జీవించాలి దేవుడా అంటూ నాటి నుంచి రోధించసాగారు. పింఛన్‌లను తొలగింపు నిర్ణయంపై వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున ఉద్యమం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పింఛన్ తొలగించమని, అర్హత ఉన్న వారు ఆయా మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటన ఇచ్చింది. దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నారు. మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల అధికారులు వికలత్వ పరీక్షలకు హాజరు కావాలని పింఛన్ పొందుతున్న దివ్యాంగులకు నోటీసులు జారీ చేశారు. ప్రొద్దుటూరులో రీ వెరిఫికేషన్ సదరం క్యాంపును ఏర్పాటు చేశారు. ఈఎన్‌టీ, ఆప్తాల్మిక్, ఆర్థో విభాగాలకు సంబంధించి ప్రతి రోజు 30 మందికి వికలత్వ నిర్ధారణ పునఃపరీక్షలను నిర్వహించనున్నారు.

జీఎస్టీ తగ్గుదలతో ప్రజలకు డబ్బు ఆదా...



మేళాను పరిశీలిస్తున్న స్టేట్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ జి.సుమతి

ప్రొద్దుటూరు కల్చరల్ : జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం తగ్గించడంతో వస్తువులు, గృహ ఉపకరణాల కొనుగోలు వల్ల ప్రజలకు డబ్బు ఆదా అవుతుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జార్జ్ కారొనేషన్‌క్లబ్‌లో శుక్రవారం వాణిజ్యపన్నుల శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ 2.0 సూపర్ సేవింగ్స్ గృహోపకరణాలు, వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగ్జిబిషన్ మేళా ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని వినియోగదారులు సద్వినియోగం చేసుకుని డబ్బు ఆదాచేసుకోవాలన్నారు. స్టేట్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ జి.సుమతి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ వస్తువులపై 28 శాతం ఉన్న జీఎస్టీని 18 శాతంకు తగ్గించిందన్నారు. వివిధ వ్యాపార సంస్థలు టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మిషన్‌లు, ఏసీ, డిష్‌వాషర్‌లు, ఇన్వర్టర్ బ్యాటరీలు తదితర వస్తువులను మేళాలో అందుబాటు ధరలో ఉంచారు. ఈ మేళా శనివారం కూడా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చింతా రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్‌లు డి.జ్ఞానానందరెడ్డి, ఎస్. రాజ నరసింహారెడ్డి, జీఎస్టీ నోడల్ ఆఫీసర్ హనుమంతరావు, వాణిజ్యపన్నులశాఖ, మున్సిపల్ అధికారులు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల విక్రయదారులు, ప్రజలు పాల్గొన్నారు.

దోమకాటు బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బద్వేలు అర్బన్ : దోమకాటు బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య అన్నారు. తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వనంపుల సచివాలయం పరిధిలోని నందిపల్లె, తొట్టిగారిపల్లె గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం – దోమలను నివారిద్దాం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలో ఒక రోజు డ్రైడే పాటించడంతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని అన్నారు. అలాగే ఇంటి పరిసరాలలోని డ్రమ్ముల్లో, ఎండిన కొబ్బరి బోండాల్లో, టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. దోమల బారిన పడకుండా దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్ఓ చంద్రావతి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌పై అవగాహన ముఖ్యం



డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న నాగార్జునరెడ్డి తదితరులు

పోరుమామిళ్ల : పార్టీ కార్యకర్తలు, నాయకులపై కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులు, అక్రమ కేసులను ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ఏర్పాటు చేశారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి తెలిపారు. డిజిటల్ బుక్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. శుక్రవారం బెంగళూరులోని మార్తహళ్లిలో నాగార్జునరెడ్డి డిజిటల్ క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుస్తుందని, అధికారం శాశ్వతం కాదని ఈ విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తించాలని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే డిజిటల్ బుక్‌లో నమోదైన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

పోరుమామిళ్ల : పేదలకు మెరుగైన వైద్యాన్ని, వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే, ప్రైవేటీకరణ ద్వారా వాటిని సీఎం చంద్రబాబు పేదలకు దూరం చేస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాశినాయన మండల జెడ్పీటీసీ దేవసాని సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయ కర్త రమణారెడ్డి, కాశినాయన మండల పార్టీ అధ్యక్షులు హనుమంతరెడ్డి, సీనియర్ నాయకులు పంగా గురివిరెడ్డి, పార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గం



కోటి సంతకాల సేకరణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం దుర్మార్గపు చర్య అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కరపత్రాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు కొత్తగా మెడికల్ కళాశాలలను నిర్మించాలనే ఆలోచనే గత ప్రభుత్వాలకు రాకపోవడం శోచనీయమన్నారు. ఒకే మారు 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను మంజూరు చేసి నిర్మాణ పనులను ప్రారంభించారన్నారు. ఇందుకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం ఈ కళాశాలలను ప్రైవేట్ పరం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుబాష్‌రెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

నేడు పీఎం ధనధాన్య కృషి యోజన ప్రారంభం

మైదుకూరు : మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం ప్రారంభమవుతుందని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. ప్రధాన మంత్రి ఈ పథకాన్ని ప్రారంభించే కార్యక్రమం కేంద్రంలో లైవ్ ద్వారా చూపిస్తామని పేర్కొన్నారు. రైతులందరూ ఉదయం 10 గంటలకు కేవీకేకు వచ్చి శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ, రబీలో వివిధ పంటలలో చేయాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించే కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

అవగాహన ర్యాలీ

ప్రొద్దుటూరు : స్థానిక చౌడేశ్వరినగర్‌లోని షెల్టర్ ఫర్ అర్బన్ హోంలెస్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా నిరాశ్రయుల అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు దేవదాసు పట్టణ నిరాశ్రయులు రాత్రివేళల్లో రోడ్ల మీద ఇబ్బంది పడకుండా షెల్టర్‌కు వచ్చి, ఉచిత భోజనం, వసతి పొందాలని తెలిపారు. కార్యక్రమంలో బ్లూకోల్ట్ పోలీసు చిన్న పెద్దన్న యాదవ్, సచివాలయం ఏఎన్ఎం ఎన్.శిల్పలత, ఎస్‌యూహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 25లోగా పంట నమోదు పూర్తి చేయాలి

చాపాడు : ఈ నెల 25వ తేదీలోగా పంట నమోదు పూర్తి చేయాలని ఏడీఏ కృష్ణమూర్తి తెలిపారు. చాపాడు రైతు సేవా కేంద్రంలో పంట నమోదు, పంట కోత ప్రయోగం అంశాలపై అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఏడీఏ మాట్లాడుతూ పంట సాగు చేసిన ప్రతి రైతుకు చెందిన పంటను నమోదుచేయాలన్నారు. నూర్పిడి దశలో పంట కోత ప్రయోగాలను తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దేవీపద్మలత, ఏఎస్ఓ ప్రమీల, ఏఈఓ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మైదుకూరు : మండలంలోని వనిపెంట మహాత్మా జ్యోతి రావు పూలే వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నిర్మల తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్ 19 విభాగం 400 మీటర్ల పరుగు పందెంలో పి.కుసుమ, బాస్కెట్‌బాల్‌లో పి.లక్ష్మీ అపూర్వ, జి.అమీరూన్, ఎ.హిమబిందు, హ్యాండ్ బాల్‌లో జి.స్నేహ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. వారిని కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయినులు అభినందించారు.

ప్రకృతి వనరులపై కార్పొరేట్ దోపిడీ ఆపాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రకృతి వనరులపై కార్పొరేట్ దోపిడీ, అభివృద్ధి పేరిట జరిగే దారుణమైన విధ్వంసం ఆపాలని పౌరహక్కుల సంఘం కడప జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు తెలిపారు. మిత్రజ్యోతి, విరసం, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో 'అభివృద్ధి పేరుతో చత్తీస్‌గఢ్‌లో ఏం జరుగుతోంది' పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1990 దశకం నుంచి ప్రపంచీకరణ పేరుతో కార్పొరేట్ పెట్టుబడిదారులకు ప్రకృతి సంపదను దోచిపెట్టే కుట్రకు పాలకవర్గాలు తెరలేపాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా యూత్ కన్వీనర్ హేమంత్‌కుమార్, అధ్యక్షుడు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రొద్దుటూరు : స్థానిక రోటరీ కంటి ఆస్పత్రి ఆవరణలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రోటరీ క్లబ్ మిడ్ టౌన్, రోటరీ క్లబ్, రోటరీ కంటి ఆస్పత్రి, శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శుక్రవారం రోటరీ కంటి ఆస్పత్రిలో ఉచి మెగా వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను రోటరీ ట్రస్టు కార్యదర్శి ఎంవీఎస్ ప్రభు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి, మిడ్ టౌన్ రోటరీ క్లబ్ సెక్రటరీ బీవీ రాజుఖ, హోలిస్టిక్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ నరసింహారావు, సీనియర్ రొటేరియన్ బేపారి జాకీర్ అహ్మద్ ఆవిష్కరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు

- మన ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఇక నుంచి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డుకు సంబంధించి శుక్రవారం వార్డు కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చేందుకు ప్రణాళికలను తయారు చేసిందన్నారు. ఇందుకోసమే వివిధ విభాగాలకు సంబంధించి వార్డు కమిటీలు, గ్రామ కమిటీల సభ్యుల నియామకం జరుగుతోందన్నారు. కమిటీ సభ్యులకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డు ఇస్తారని, పేర్లన్నీ మాజీ ముఖ్యమంత్రి జగన్ డ్యాష్ బోర్డులో నమోదై ఉంటాయన్నారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ చర్యలు తీసుకుంటుందని కోరారు. తమ ప్రభుత్వ హయాంలోనే ప్రొద్దుటూరు నియోజకవర్గం ఎంతో అభివృద్ధి జరిగిందని, కూటమి ప్రభుత్వంలో టెంకాయ కొట్టే పరిస్థితి లేదన్నారు. తాగునీరు అందించామని, నూతన రోడ్లతో మున్సిపాలిటీని అభివృద్ధి చేశామని, పార్కులను నిర్మించామని తెలిపారు. జగనన్న కాలనీలను నిర్మించామన్నారు. రూ.5 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించామని, రూ.150 కోట్లతో నిర్మించిన అమృత్ పథకం ద్వారానే ప్రొద్దుటూరుకు శాశ్వత నీటి సమస్య పరిష్కారమైందన్నారు. ప్రజల కోసం జగన్ అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, డ్వాక్రా రుణ మాఫీ, నేతన్న నేస్తం ఇలా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, గురవయ్యతోట రోడ్డు, మైదుకూరు రోడ్డు మన హయాంలోనే అభివృద్ధి చేశామన్నారు. అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. వెల్లాల గుడి అభివృద్ధి కోసం పనులు ప్రారంభించామని తెలిపారు. ఎంపీపీ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ పొరపాట్లను సరిదిద్దుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందడుగు వేసిందని తెలిపారు. ఏ నోట విన్నా జగన్ గురించే మాట్లాడుతున్నారని, 2029లో తప్పక అధికారంలోకి వస్తామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ వార్డు కమిటీ సభ్యులకు సంబంధించి తన సతీమణి పోరెడ్డి సుజాత ఫౌండేషన్ తరపున బీమా సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. రూ.33 కోట్లతో మన ప్రభుత్వ హయాంలో వార్డులో అభివృద్ధి పనులు చేశామని, ఈ ప్రభుత్వ హయాంలో అభివృద్ధే లేదన్నారు. మన ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన కూరగాయల మార్కెట్, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం, జగనన్న కాలనీలను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు పందిటి సరోజమ్మ, గరిశపాటి లక్ష్మీదేవి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ, గుర్రం లావణ్య, రావులకొల్లు అరుణ, ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, ప్రొద్దుటూరు కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు ప్రాధాన్యత ఇవ్వండి

ప్రొద్దుటూరు రూరల్ : నష్టాలలో కుంగిపోతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. మండలంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం 19వ విడత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పురుగుల మందు వినియోగించని ఆహార ఉత్పత్తులను తయారు చేసి ఆరోగ్యవంతమైన సమాజానికి దోహదపడాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉపాధి పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. డ్వామా పీడీ ఆది శేషారెడ్డి మాట్లాడుతూ కొత్త రకాల పనులను గుర్తించి ఉపాధి కూలీలకు పని కల్పించాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులను మాత్రమే గుర్తించాలని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు నచ్చిన పనులను గుర్తించరాదన్నారు. ఈ తనిఖీలలో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 2024–25 సంవత్సరానికి గాను రూ.4,79,03,207 నిధులను కూలీలకు వేతనాల రూపంలో చెల్లించారు. ఇందులో రూ.26వేలు రికవరీ చేసినట్లు పీడీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సీనరైజెస్ చార్జెస్ పంచాయతీరాజ్ శాఖ ఈఈ అకౌంట్‌లో జమ చేస్తున్నామని డీఆర్పీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. నక్కలదిన్నె గ్రామంలోని ఓసీ కాలనీలో కూలీలకు ఈ ఏడాది పని కల్పించకపోవడంపై అక్కడి ప్రజలు ఫిర్యాదు చేశారు. అలాగే దొరసానిపల్లె గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లకుండానే మస్టర్‌లో పేర్లు నమోదుచేసి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని, ఇందుకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై, కూలీలపై విచారించి చర్యలు చేపట్టాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద లెటర్ ప్యాడ్‌పై లేఖను పీడీకి దొరసానిపల్లె గ్రామస్తులు అందించారు.

మత్తుపదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎస్పీ, సీఐ, కళాజాగృతి బృందం

బద్వేలు అర్బన్ : యువత మత్తుపదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోలీసు కళాజాగృతి బృందం ఆధ్వర్యంలో ఓ యువత మేలుకో నాటక ప్రదర్శన ద్వారా మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు కళాజాగృతి బృందం ఇన్‌చార్జి నరసరామ్, కళాశాల ఏఓ ఆర్.వి.సాయిక్రిష్ణ, ప్రిన్సిపాల్ ఓబులేసు, ఫ్యాక్షన్ జోన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం, ఏఎస్ఐ చంద్రనాయక్, ఉపాధ్యాయ సంఘం నేత విజయకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణదారులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు నిబంధనలు పాటించాలని బద్వేలు ఆర్డీవో ఎ.చంద్రమోహన్ సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని రెవెన్యూ, పోలీసు, ఫైర్, విద్యుత్, వైద్య, ఆరోగ్యశాఖ, వాణిజ్య పన్నులశాఖ అధికారులు, టపాసు దుకాణాల యజమానులతో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లైసెన్స్ పొందినవారు మాత్రమే టపాసుల విక్రయాలు సాగించాలని, అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణదారుడు దుకాణం వద్ద నీటి డ్రమ్ములు ఏర్పాటుచేయడంతో పాటు ఇసుకను ఉంచాలని, అలాగే అగ్ని ప్రమాద నిరోధక యంత్రాలు ఉంచుకోవాలని సూచించారు. స్టాల్స్‌కు నాణ్యత కలిగిన ఎలక్ట్రికల్ వైర్లను ఉపయోగించాలని, దీనిని సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ, డీఈ, సేల్‌ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఆయా మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, బద్వేలు, పోరుమామిళ్ల సీఐలు, ఫైర్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు తక్షణమే తగ్గించాలి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో పెంచిన ఇంటిపన్నులు, ప్లాన్ అప్రూవల్ ధరలు తక్షణమే తగ్గించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కె.జకరయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పేదలకు అందుబాటులో ఉండే పన్నుల ధరలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విపరీతంగా పెంచడం ద్వారా పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పట్టణంలోని పేదల కాలనీల్లో ప్రజల వద్ద వేలకు వేలు పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు ఆ కాలనీల అభివృద్ధిని విస్మరించడం దారుణమన్నారు. తక్షణమే పెంచిన ఇంటి పన్నులు, ప్లాన్ అప్రూవల్ ధరలు తగ్గించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు అనిల్, ఏరియా కమిటీ సభ్యులు రామరాజు, విజయరావు, నారాయణ, చంద్రపాల్, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సొసైటీ కన్వీనర్ అఫ్జల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సదరం రీ వెరిఫికేషన్‌లో అనేక అవకతకలు, తప్పులు జరిగాయన్నారు. సదరం సర్టిఫికెట్‌లో పురుషుల ఫొటోకు అమ్మాయి ఫొటో, అమ్మాయి సర్టిఫికెట్‌లో పురుషుల ఫొటో ముద్రించారన్నారు. అనేక సాంకేతిక లోపాలు ఉన్నాయన్నారు. వారు చేసిన తప్పులకు దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలియో వల్ల రెండు కాళ్లు చచ్చుబడిన, కదలలేని స్థితిలో ఉన్న శారీరక దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్‌లో పర్సెంటేజీని తగ్గించడంతో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దివ్యాంగులకు నియోజకవర్గానికి పెట్రోల్ త్రీవీలర్ స్కూటీలు 40 మంజూరు చేయాలని, రెండు కాళ్లు, చేతులతో పాకులాడుతున్న దివ్యాంగులకు, క్యాలిఫర్స్, చంక కర్రల సహాయంతో నడిచే వారికి కృత్రిమ అవయవాలతో నడిచే వారికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. స్కూటీల మంజూరులో నిబంధనలను సడలించి దివ్యాంగులకు న్యాయం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.